'తల్లికి వందనం'కు ఎన్‌పిసిఐ లింకు తప్పనిసరి

శ్రీకాకుళం సిటీ : తల్లికి వందనం పథకం ప్రయోజనాలను విద్యార్థులు సకాలంలో పొందాలంటే తమ బ్యాంకు ఖాతాలను జాతీయ చెల్లింపుల సంస్థ (ఎన్‌పిసిఐ)తో అనుసంధానం చేయించుకోవడం అత్యవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాల 9, 10 తరగతుల్లో చదువుతున్న విద్యార్థులకు అందే నిధులను వారి తల్లుల ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వారి వ్యక్తిగత ఖాతాల్లోకి జమ కానున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో తల్లులు, విద్యార్థులు తమ ఖాతాలను వెంటనే జాతీయ చెల్లింపుల సంస్థతో అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. ఖాతా లేకపోతే తపాలా కార్యాలయంలో తెరిచి, అనుసంధానం చేయించుకోవాలని తెలిపారు.

జిల్లాలో ఇప్పటికీ 1360 మంది విద్యార్థులు ఖాతాలను అనుసంధానం చేయించుకోలేదని తెలిపారు.

పరిశ్రమలపై ప్రచారమే

- ఏడాది కాలంలో ఒక్క ప్రతిపాదనా పట్టలెక్కని వైనం
- నిర్వహణా భారంతో ఒక్కొక్కటిగా మూతపడుతున్న పరిస్థితి
- ఉపాధి కోసం యువత ఇతర ప్రాంతాలకు వలస
- పరిశ్రమలు, ఉద్యోగాలంటూ కూటమి నేతలు తెగ ప్రచారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



దేశంలో ఎక్కడికి వెళ్లినా జిల్లాకు చెందిన కార్మికులే కనిపిస్తారు. జిల్లాకు కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం. జిల్లా నుంచి కార్మికులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోకుండా, ఇతర ప్రాంతాలే జిల్లా వైపు చూసేలా చేస్తాం. ఇవీ ఎన్నికల ముందు పలాస, పాతపట్నం తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ప్రజాగళం సభల్లో ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా జిల్లాలో కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా పట్టాలెక్కలేదు. కొత్త పరిశ్రమలు ఏర్పాటు విషయం పక్కన పెడితే ఉన్న పరిశ్రమలు మూతపడుతున్న పరిస్థితి నెలకొంది. మరోవైపు గ్రామీణ ప్రాంతాల నుంచి వలసల పరంపర కొనసాగుతూనే ఉంది.

జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం ఇథనాల్, పేపర్, ఫార్మాస్యూటికల్స్ పవర్ జనరేషన్, గ్రానైట్ వంటి భారీ, మెగా పరిశ్రమలు 40 వరకు ఉన్నాయి. వీటి ద్వారా 63,070 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు ప్రభుత్వం లెక్కలు చెప్తోంది. వీటితోపాటు రైస్ మిల్లులు, జీడిపప్పు పరిశ్రమలు, పేపర్ ప్లేట్ ఉత్పత్తులు, పాలిథిన్ క్యారీ బ్యాగులు, ఇత్తడి వంటి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు 4,083 పరిశ్రమలున్నాయి. జిల్లాలో 2014 నుంచి 2024 మధ్య కాలంలో కొత్తగా ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదు. 2014 నుంచి 2019 వరకు టిడిపి హయాంలో విశాఖలో రెండు పర్యాయాలు పారిశ్రామిక సమ్మిట్‌లు నిర్వహించారు. లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయంటూ నాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు చెప్పారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యవసాయ అనుబంధ రంగాల పరిశ్రమలు, తయారీ రంగం యూనిట్లు వస్తాయన్నారు. జిల్లాకు ఇప్పటివరకు ఒక్కటీ రాలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం హయాంలోనూ కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాలేదు.

అటకెక్కిన పాత ప్రతిపాదనలు

రణస్థలం మండలం సంచాంలో ఏడాదికి తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల మందుల ఉత్పత్తితో రూ.350 కోట్లతో బల్క్ డ్రగ్ ఉత్పత్తులను ప్రారంభించేందుకు హైయాసింథాస్ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. పరిశ్రమకు కావాల్సిన 11.41 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పగించాల్సి ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేయనున్న ప్రాంతం అనువైనదేనని అధికారులు తనిఖీ చేసి నిర్ధారించారు. ఇప్పటికీ భూమి అప్పగింత ఆలస్యమవుతోంది. అదే మండలంలోని చిట్టివలసలో రూ.720 కోట్లతో ఏడాదికి 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ఔషధాలు ఉత్పత్తి చేసేందుకు సంబంధిత యాజమాన్యం ముందుకొచ్చింది. పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి కల్పించేందుకు అంగీకరించింది. పరిశ్రమకు 13.91 ఎకరాల భూమి కావాల్సి ఉంది. ప్రస్తుతం భూపరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతం అనువైనదేనని అధికారులు నిర్ధారించారు. ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతులు రాలేదు. ఎచ్చెర్ల మండలం అల్లినగరంలో రూ.65 కోట్లతో రసాయనిక పరిశ్రమ ఏర్పాటుకు ఎన్‌ఎసిఎల్ ముందుకొచ్చింది. పరిశ్రమలో 200 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి.

మూతపడినవి తెరిపిస్తే అదే పదివేలు

కొత్త పరిశ్రమలు తీసుకొస్తామని చెప్తున్న కూటమి నేతలు... జిల్లాలో ప్రత్యక్షంగా రెండు వేల మందికి, పరోక్షంగా పది వేల మందికి ఉపాధి కల్పించే ఆమదాలవలస చక్కెర పరిశ్రమను తెరిపించే విషయం కనీసం నోరెత్తడం లేదు. పైగా రూ.వందల కోట్ల విలువ చేసే ఫ్యాక్టరీ స్థలాలను తమ అనుయాయులకు కారుచౌకగా కట్టబెట్టేందుకు అక్కడ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామంటూ ఆమదాలవలస ఎన్నికల ప్రచార సభ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జిల్లాలో ముడిసరుకు లభ్యం కాక విద్యుత్ ఛార్జీలు, ఇతర పన్నులు భరించలేక అనేక చిన్నచితకా పరిశ్రమలు మూతపడ్డాయి. వీటిలో జ్యూట్ పరిశ్రమలు ప్రధానమైనవి. జిల్లాలో జ్యూట్ పరిశ్రమల మూతపై గత వైసిపి ప్రభుత్వ హయాంలో అధ్యయనం చేసిన అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అప్పటి వైసిపి ప్రభుత్వం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటిని తెరిపించే విషయంలో స్పందన లేదు. వీటితో పాటు కాన్‌కాస్ట్, సింథటిక్, ప్లాస్టిక్ తదితర చిన్నాచితకా పరిశ్రమలూ మూతపడ్డాయి.

పరిశ్రమల దుస్థితికి అద్దంపడుతున్న ఎంఎస్‌ఎంఇ సర్వే

టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతేడాది డిసెంబరులో సూక్ష్మ, మధ్య చిన్న తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఇ)పై ప్రభుత్వం సర్వే నిర్వహించింది. సర్వేలో జిల్లాలో పరిశ్రమల స్థితిగతులపై అనేక విషయాలు వెలుగు చూశాయి. జిల్లాలో అన్నిరకాల పరిశ్రమలు మొత్తం 27,718 పరిశ్రమలను సర్వే బృందాలు సందర్శించాయి. వాటిలో 12,508 మూతపడినట్లు గుర్తించాయి.

ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

'తల్లికి వందనం'లో కోత సిగ్గుచేటు

- నిబంధనలు విధించడం సరికాదు
- సాంకేతిక సమస్యల పేరిట ఎగ్గొట్టే ప్రయత్నం
- షరతుల్లేకుండా వర్తింపజేయాలి
- ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎన్నికల సమయంలో ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామని హామీనిచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం, నేడు పాఠశాలల అభివృద్ధి పేరుతో రూ.రెండు వేలు కోత పెట్టడం దుర్మార్గమని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డి.చందు అన్నారు. తల్లికి వందనం పథకంలో నిబంధనలు, రూ.రెండు వేలు కోత పెట్టడాన్ని నిరసిస్తూ నగరంలోని సూర్యమహల్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వం ఇచ్చే రూ.15 వేలు పిల్లల విద్యకు కొంతో గొప్ప ఉపయోగపడతాయన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు కట్టడానికి దోహదపడతాయని భావించారని తెలిపారు. ప్రభుత్వం ప్రతి తల్లి అకౌంట్‌లో డబ్బులు పడతాయని చెప్పి ఆ సంతోషం అర క్షణం కూడా ఉండనివ్వకుండా కుటుంబ ఆదాయం గ్రామాల్లో నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12వేలు లోపు ఉండాలని, రైస్ కార్డు ఉండాలని, కుటుంబానికి మూడెకరాల్లోపు మాగాణి గానీ 10 ఎకరాల్లోపు పొడి భూమి, లేదా రెండూ కలిపి 10 ఎకరాల్లోపు ఉండాలని నిబంధనలు విధించిందన్నారు. ట్యాక్సీ, ట్రాక్టర్, ఆటో సహా ఎలాంటి ఫోర్ వీలర్స్ ఉండకూడదని, కరెంట్ బిల్లు నెలకు 300 యూనిట్లు దాటకూడదని, విద్యార్థుల హాజరు కచ్చితంగా 75 శాతం ఉండాలని షరతులు పెట్టిందన్నారు.

వీటితోపాటు పాఠశాల అభివృద్ధికి రూ.రెండు వేలు కోత విధించడం సిగ్గుచేటు అన్నారు. కొంతమందికైతే సాంకేతిక సమస్యలంటూ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం చదువుకునే ప్రతి విద్యార్థికి ఎలాంటి షరతులు లేకుండా తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేసి, రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులను కలుపుకొని నిరసనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు హరీష్, జయరాం, పట్టణ కమిటీ సభ్యులు కార్తీక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సెంటు భూమి ఉన్నా 'అన్నదాత సుఖీభవ'

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి - సరుబుజ్జిలి, ఆమదాలవలస

విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకాన్ని సెంటు భూమి ఉన్న రైతునూ లబ్ధిదారునిగా గుర్తించి అందిస్తామని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస గ్రామ సచివాలయ పరిధిలో రాయితీపై విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తప్పుడు గణాంకాలతో సంక్షేమ పథకాలు అందించేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎల్.మధుసూదన్, ఎంపిడిఒ ఎం.పావని, వ్యవసాయ అధికారి బి.పద్మనాభం, డిసిసిబి ఛైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, టిడిపి నాయకులు తాడేల వెంకటరమణ, తాడేల రాజారావు, కిల్లి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కనుమరుగు కావడం ఖాయం

కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైసిపి ఓర్వలేకపోతోందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. రానున్న రోజుల్లో ఆ పార్టీని ప్రజలే కనుమరుగు చేస్తారని చెప్పారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని పీకల్లోతు అప్పుల్లో ముంచి, ప్రజాధనాన్ని దోపిడీ చేశారని ఆరోపించారు. ప్రపంచ మేధావుల్లో ఒకరైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై తమ స్థాయిని మరిచి నేరచరిత్ర కలిగిన వైసిపి నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. తల్లికి వందనం పథకం 82 లక్షల మంది విద్యార్థులకు మంజూరు చేయలేదని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అసత్య ఆరోపణలు చేశారన్నారు. గత ప్రభుత్వంలో 42 లక్షల మంది విద్యార్థులను గుర్తించి కేవలం 18 లక్షల మంది విద్యార్థులకు అమ్మఒడి పథకం వర్తింపజేసిన విషయాన్ని వైసిపి నాయకులు మరిచినట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 67 లక్షల మంది విద్యార్థులకు ఒకే విడతలో రూ.8,756 కోట్లను తల్లుల ఖాతాల్లో జమ చేస్తే, వైసిపి నాయకులు పిచ్చి ప్రేలాపనలు సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆమదాలవలస నియోజకవర్గంలోనూ చంద్రబాబు నాయుడు వయసు పాటి అనుభవం లేని వైసిపి నాయకుడు స్థాయిని మించి విమర్శలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రానికి పెట్టుబడులు పరిశ్రమలు తీసుకొచ్చిన దాఖలాల్లేవని విమర్శించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు పవన్ కళ్యాణ్, లోకేష్ నిరంతరం శ్రమిస్తూ రూ.50 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు మొదలవలస రమేష్, అన్నెపు భాస్కరరావు, కూన ఆంజనేయులు, నాగళ్ల మురళీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

జీడి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల సందర్భంగా టిడిపి నాయకులు జీడి రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని బాతుపురంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా, ఎన్నికల్లో జీడి రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. జీడి మద్దతు ధర, జీడి అభివృద్ధి బోర్డు, కార్పొరేషన్ విషయంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు పలాస వేదికగా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హామీనిచ్చారని గుర్తుచేశారు. జీడి రైతుల ఓట్లతో గెలిచిన వారు, ఎన్నికైన అనంతరం జీడి రైతులను విస్మరించడం తగదన్నారు. జీడి పరిశ్రమల యజమానులు అక్రమ లాకౌట్‌తో ఇటు రైతాంగాన్ని అటు కార్మికులను ఆర్థిక దోపిడీకి గురిచేస్తుంటే ప్రభుత్వ పెద్దలు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే శిరీష కూడా స్పందించడం లేదన్నారు. మార్కెట్‌లో జీడిపప్పు ధర బాగానే ఉన్నా, స్థానిక వ్యాపారులు జీడి పిక్కలు కొనుగోలు చేయకుండా కృత్రిమ మాంద్యాన్ని సృష్టించి కారుచౌకగా రైతుల నుంచి జీడిపిక్కలు కొనుగోలు చేయాలన్న దురాశతో లాకౌట్ ప్రకటించారని విమర్శించారు. జీడిపిక్కల ధరను బస్తాకు రూ.రెండు వేల వరకు తగ్గించేశారని తెలిపారు. రైతుల వద్దనున్న పిక్కలు అమ్ముడుపోక, మరోవైపు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీష జోక్యం చేసుకుని జీడికి మద్దతు ధర ప్రకటించి రైతు సేవా కేంద్రాల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో జీడి రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో జీడి రైతుసంఘం నాయకులు కోనేరు రమేష్, ఎంపల్ల కామేశ్వరరావు, పి.కామేశ్వరరావు, మడ్డు రాఘవరావు, ఎ.దానేష్, జీడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

తరగతుల బహిష్కరణతో ఖాళీగా ఉన్న తరగతి గది

విద్యార్థులు తరగతుల బహిష్కరణ

మద్యం షాపును తొలగించాలని నిరసన

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలోని ఈదుపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం షాపును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఆ పాఠశాల విద్యార్థులు శుక్రవారం తరగతులు బహిష్కరించి నిరసన తెలిపారు. వేసవి సెలవుల్లో పాఠశాలకు సమీపంలో మద్యం షాపును ఒక కంటైనర్‌లో ఏర్పాటు చేసి ప్రారంభించడంతో గ్రామస్తుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, గ్రామస్తులు ఈనెల 12వ తేదీన భారీ ర్యాలీ నిర్వహించగా, తాజాగా విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. పాఠశాలకు సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయరాదన్న నిబంధనలు ఉన్నా, అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచ్ నర్తు వరప్రసాద్ విమర్శించారు. మద్యం దుకాణాన్ని తొలగించాలని ఇప్పటికే గ్రామ పంచాయతీ తరుపున కలెక్టర్, ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందించామన్నారు. జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే చొరవ తీసుకుని ఉన్నత పాఠశాలకు సమీపంలోని మద్యం దుకాణాన్ని తొలగించాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

నేడు ఉత్తరాంధ్ర గ్రంథాలయ సదస్సు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గ్రంథాలయ పునర్వికాస ఉద్యమంలో భాగంగా ఈనెల 14వ తేదీన విశాఖ పౌర గ్రంథాలయంలో ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ బుడుమూరు సూర్యారావు, కో కన్వీనర్ డాక్టర్ జామి భీమశంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సదస్సుకు ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ కె.ఎస్ చలం అధ్యక్షత వహించనుండగా, రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారని తెలిపారు. చలంతో పాటు మరో ఐదుగురు పూర్వ వైస్ ఛాన్సలర్లు సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

ఆచార్య జి.నాగేశ్వరరావు (ఆంధ్ర విశ్వవిద్యాలయం), సుదర్శన్ రొక్కం (విక్రమ్ సింహపురి విశ్వవిద్యాలయం), వై.సత్యనారాయణ (దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం), ఎం.ముత్యాలనాయుడు (ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం), డాక్టర్ హెచ్.లజపతిరాయ్ (బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం) ముఖ్య అతిథులుగా హాజరవుతారని వివరించారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఎం.వి.ఎస్ శర్మతో పాటు సాహిత్యం, జర్నలిజం, గ్రంథాలయ ఉద్యమం వంటి పలు రంగాలకు చెందిన వారు హాజరు కానున్నట్లు తెలిపారు.

బంగారం కోసమే హత్య

వృద్ధురాలి హత్య కేసు నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి శ్రీనివాసరావు

మండలంలోని హరిశ్చంద్రపురానికి చెందిన వృద్ధురాలు దుంపల దాలమ్మ హత్య కేసును పోలీసులు ఛేదించారు. బంగారు ఆభరణాల కోసం అదే గ్రామానికి చెందిన బల్లి రాము ఈనెల తొమ్మిదో తేదీన హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్‌పి పి.శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దాలమ్మ ఇంట్లో మోటారు బాగుచేయడానికి ఈనెల ఎనిమిదో తేదీన రాము ఆమె ఇంటికి వెళ్లాడు. ఆమె ఒంటరిగా ఉండడం, విలువైన బంగారు ఆభరణాలు మెడలో ఉండడాన్ని గమనించిన రాము, వాటిని ఎలాగైనా కాజేయాలని పన్నాగం పన్నాడు.

మరుసటి రోజుకు మోటారు మరమ్మతుల పనిని వాయిదా వేసి, తొమ్మిదో తేదీన రాత్రి ఎనిమిది గంటల తర్వాత ఇనుపరాడ్డుతో మృతురాలి ఇంటికి మోటారు బాగు చేసే నెపంతో వెళ్లాడు. దాలమ్మ టీ పెడుతున్న సమయంలో తలపై వెనుక నుంచి బలంగా ఇనుపరాడ్డుతో కొట్టాడు. ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్నాక మెడలోని బంగారు ఆభరణాలు దొంగిలించి పారిపోయాడు.

పదో తేదీన మృతురాలి కుమారుడు రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎఎస్‌పి తెలిపారు. నిందితుడిని శుక్రవారం మధ్యాహ్నం హరిశ్చంద్రపురం బస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రెండున్నర తులాల పుస్తెలతాడు, ఇనుపరాడ్డును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. సమావేశంలో టెక్కలి సిఐ కె.శ్రీనివాసరావు, ఎస్‌ఐ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

జీడి పరిశ్రమలు తెరవకపోతే నిరవధిక ధర్నా

ప్రజాశక్తి - పలాస

జీడి పరిశ్రమలు సోమవారం నుంచి తెరవకపోతే కాష్యూ అసోసియేషన్ హాల్ (పిసిఎంఎ) ముందు నిరవధిక ధర్నా చేపడతాతమని కాష్యూ లేబర్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అంబటి కృష్ణమూర్తి, ఎన్.ఈశ్వరరావు ప్రకటించారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో శుక్రవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి పరిశ్రమల ఒడిదుడుకులు పేరుతో పరిశ్రమల యాజమానులు రెండు వారాలు బంద్ చేపడుతున్నట్లు యూనియన్‌కు గత నెల 29న లేఖ ఇచ్చారని తెలిపారు. ఒక వారం మాత్రమే చేపట్టాలని కోరినా, నేటికీ పరిశ్రమలు తెరవడం లేదన్నారు. దీంతో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీడిపిక్కలను బయట గ్రామాలకు తీసుకెళ్లి వలిపిస్తూ, పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల్లో జీడి పరిశ్రమలు పనిచేస్తున్నాయని, ఇక్కడే ఒడిదుడుకులు ఉన్నాయా అని ప్రశ్నించారు. బంద్ పేరుతో కొందరికి పనులు కల్పించి, మరికొందరికి కల్పించకపోవడం సరికాదన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు భీమారావు, జోగ నాగేశ్వరరావు, కోనారి రాము, జోగ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల భూ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - హిరమండలం, కొత్తూరు



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

గిరిజనుల భూ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే డి-పట్టాలు కలిగిన గిరిజనులతో ఏరువాక కార్యక్రమం చేపడతామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాదరావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న అన్నారు. హిరమండలం మండలంలోని జగన్నాథపురం గిరిజనుల భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్నాథపురం గిరిజనుల జీవనోపాధి కోసం 40 ఏళ్ల కిందట ప్రభుత్వం సర్వే నంబరు 284. 284బి1.లో భూపంపిణీ చేసి హక్కు పత్రాలు ఇచ్చిందన్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి గిరిజనుల భూములను గిరిజనేతరులు ఆక్రమించుకున్నారని తెలిపారు. దీనిపై తహశీల్దార్ జోక్యం చేసుకుని హక్కు పత్రాలు కలిగిన గిరిజనులకు భూములను అప్పగించాలన్నారు. లేకుంటే హక్కు పత్రాలు కలిగిన గిరిజనులతో కలిసి ఏరువాక కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో ఊలక భవాని, రుగడ నర్సయ్య, ఆదిలక్ష్మి, భీముడు, చిన్నమ్మి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAMES

1. **Krishna Murty** (Old Name) S/o Narsimhulu R/o Door No 1-40 S M Puram Peta Village Etcherla Mandal, Srikakulam District, Andhrapradesh, 532410. I Have changed my name as
2. **Jagadeeshwari** (Old Name) W/o Metta Krishna Murty R/o Door No 1-40 SM Puram Peta Village Etcherla Mandal, Srikakulam District, Andhrapradesh, 532410. I Have changed my name as **Krishna Murty Metta** (New Name) Hereafter my name is known as **Krishna Murty Metta** (New Name) **Tammineni Jagadeeswari** (New Name) Hereafter my name is known as (New Name) **Tammineni Jagadeeswari**

జెసిబితో కాలువలో పూడిక తీయిస్తున్న కార్యదర్శి

ఎట్టకేలకు కాలువ ఏర్పాటు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

లావేరు: మండల కేంద్రంలోని లావేరు జెడ్‌పి పాఠశాల సమీపంలోని సుభద్రాపురం, చీపురుపల్లి ప్రధాన రహదారి సమీపంలో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. కాలువ ఏర్పాటు చేశారు. జూన్ 9న చినుకుపడితే చేరువే అనే శీర్షికతో ప్రజాశక్తిలో కథనం వెలువడడంతో ఎంపిడిఒ పి.వెంకటరాజు స్పందించారు. లావేరు కార్యదర్శి బి.దాలినాయుడుకు వెంటనే లావేరు జెడ్‌పి పాఠశాల సమీపంలో కాలువలో పూడికతీత పనులు చేపట్టి రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉండకుండా చేయాలని ఆదేశించాడంతో శుక్రవారం జెసిబితో రోడ్డుపక్కన పూడికపోయి ఉన్న కాలువను తవ్వి రోడ్డుపై ఉన్న వర్షం నీరు కాలువగుండా బయటకుపోయేలా ఏర్పాటు చేశారు. దీంతో రహదారిపై ఒక్క చుక్కనీరు నిల్వ లేకుండా చేయడంతో వాహనదారులు, స్థానికులు, పాదచారులు సంతోషం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న ఎస్‌జిటి కౌన్సెలింగ్

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం రూరల్ మండలం మునసబు పేటలోని గాయత్రి కళాశాలలో ఎస్‌జిటి ఉపాధ్యాయుల మాన్యువల్ కౌన్సెలింగ్ కొనసాగుతుంది. ఈ నెల 11 నుంచి కౌన్సెలింగ్ కొ నసాగుతుంది. మూడోరోజు శక్రవారం 600 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. శనివారం ఉదయం 8 గంటలకే కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 800 మంది ఉపాధ్యాయుకు సమాచారం ఇచ్చారు. 15వ తేదీ సాయంత్రానికి కౌన్సెలింగ్ పూర్తిచేసే లక్ష్యంతో అధికారులు ఉన్నారు. ఎస్‌జిటి ఉపాధ్యాయులు జిల్లాలో 3,300 మంది వరకు ఉండగా రోజు వారీ జాబితా మేరకు అధికారులు సమయంతో సంబంధం లేకుండా రాత్రి సైతం నిర్వహిస్తున్నారు. కౌన్సెలింగ్‌లో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా విద్యాశాఖాధికారులు కౌన్సెలింగ్ పర్యవేక్షిస్తున్నారు.

కొత్తపల్లి పిహెచ్‌సిలో టిబి ముక్త్ భారత్

కోటబొమ్మాళి: మండలం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల కురుడు ఆరోగ్య ఉప కేంద్రంలో పిఎం టిబి ముక్త్ భారత్ అభియాన్ ఇంటిన్సిసైడ్ టిబి ముక్త్ భారత్ కార్యక్రమాన్ని వైద్యులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం సందర్భంగా కురుడు ఆరోగ్య ఉప కేంద్రంలో 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు షుగర్, రక్తపోటు వ్యాధి గ్రస్తులతో పాటు సుమారు 30 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎన్. వరుణ్, పిహెచ్‌సి సిబ్బంది డి.భీమారావు, డి.లక్ష్మణరావు, పి.వి. ప్రసాద్, టిబి హెల్త్ సూపర్‌వైజర్ కె.కృష్ణారావు, ఎఎన్‌ఎం, అశావర్కర్లు పాల్గొన్నారు.

బాలకృష్ణమ్మ సేవలు చిరస్మరణీయం

కవిటి: ఉపాధ్యాయ ఉద్యమ నేత మార్పు బాలకృష్ణమ్మ సేవలు అజరామరం, చిరస్మరణీయమని కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.విశ్వనాథం అన్నారు. కవిటి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో మార్పు బాలకృష్ణమ్మ 95వ జయంతిని ఎపిటిఎఫ్ 1938 మండలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. బాలకృష్ణమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి రంగారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ లోకం ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేసి ప్రభుత్వం ద్వారా ప్రయోజనాలు అందించిన ఉద్యమ నాయకుడు మార్పు బాలకృష్ణమ్మని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బల్ల ధర్మారావు, పూర్వ అధ్యక్షుడు పొళ్లాయి వాసుదేవరావు, జిల్లా కార్యదర్శి శమల్ల రాజబాబు, కర్రి కూర్మారావు, బెందాళం జానకిరావు, అనుపోజు హిమకుమార్, భార్గవ్, వరలక్ష్మి, భగవాన్, మొర్రి గోపి, ఎపిటిఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపదలో 'స్పందించారు'

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

కవిటి: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కవిటి మండలం కపాసుకుద్ధికి చెందిన రామిశెట్టి రుద్రయ్యకు ఇచ్ఛాపురం బోర్డర్ కేంద్రంగా పనిచేస్తున్న 'స్పందన' స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. శుక్రవారం గ్రామానికి చేరుకున్న స్పందన సభ్యులు రుద్రయ్యకు తమ వంతుగా రూ.6 వేలు అందించారు. అదే విధంగా గ్రామానికి చెందిన దళ గురుమూర్తి రూ.3 వేలు, నువగాం, గుడిపద్ర గ్రామాలకు చెందిన షణ్ముఖ రెడ్డి, గోపాల్ రూ.4 వేలు అందించారు. ఈ సందర్భంగా స్పందన (చలించే హృదయం) సంస్థ సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న రుద్రయ్యకు దాతలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో స్పందన స్వచ్ఛంద సంస్థ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదర్శ వ్యక్తి బాబ్జీ

నివాళ్లర్పిస్తున్న కృష్ణదాస్

నరసన్నపేట: మరువలేని వ్యక్తి టంకాల బాబ్జీ అని మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆయన జయంతి, వర్ధంతి సందర్భంగా శుక్రవారం నరసన్నపేటలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, నాయకులు చింతు రామారావు, కె.సి.హెచ్.బి గుప్త, టి.జోగారావు, పొట్నూరు నీలం, ఉప్పు లింగరాజు, ఇట్రాజు సూరిబాబు, సదాశివుని కృష్ణ, ధర్మాన జగన్, బుద్దాల రాజశేఖర్, కె.సిమ్మయ్య, పట్ట కర్రెన్న, డి.రమేష్, ఎస్. రామారావు, బి.ఎల్.శర్మ, గౌతమ్ పాల్గొన్నారు.

16లోగా ఆదర్శ పాఠశాలలో చేరాలి

రణస్థలం: రణస్థలం ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, 6వ తరగతి ప్రవేశానికి ఎంపికైన విద్యార్థుల ప్రవేశాలు జరుగుతున్నాయని, ఎంపికైన విద్యార్థులు ఈ నెల 16లోగా అడ్మిషన్ పొందాలని, లేకుంటే సీటు నిబంధనల మేరకు తరువాత ఉన్న వారికి కేటాయించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ అండ

శ్రీకాకుళం సిటీ: నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధుల సంక్షేమం కోసం ఆయుష్మాన్ భారత్ జన ఆరోగ్య మిషన్ సత్ఫలితాలు ఇస్తుందని ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ పి ప్రకాశరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శక్రవారం స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 ఏళ్లు దాటిన వృద్ధులంతా ఈ పథకం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందటానికి అవకాశం ఉందన్నారు. 70 ఏళ్లు దాటిన వృద్ధులంతా సమీప ఆరోగ్య కార్యకర్తను కలిసి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు పొందాలని సూచించారు. స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, శాసపు జోగినాయుడు, బి వి రవిశంకర్, జి.లక్ష్మి, జిఎన్ రావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు

రణస్థలం: సీనియర్ పాత్రికేయలు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు అక్రమమన్న సుప్రీం కోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టని స్థానిక వైసిపి నాయకులు, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సాక్షి ఛానెల్ డిబెట్‌లో అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ గుంటూరు తుళ్లూరు పోలీసులు కొమ్మినేనిని అరెస్టు చేశారు. ఆ అరెస్టుపై శుక్రవారం సుప్రీం కోర్టు విచారణ చేపట్టి కొమ్మినేనిని వెంటనే విడుదల చేయాలని తీర్పును వెలువరించడం హర్షనీయ మన్నారు. సమావేశంలో జెడ్‌పిటిసి సీతారాం, ఎంపిటిసి ప్రసాద్, సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ లక్ష్మునాయుడు, మాజీ ఎంపిటిసి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆలోచించండి... ఆదరించండి

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

కవిటి: తరాలు మారినా, ప్రాంతాలు మారినా రాజకీయ నాయకులు ప్రజలకు సేవ చేసేందుకే ఉన్నారని, అయితే ప్రజలు కూడా తమకు మంచిచేసి, తమ అభివృద్ధికి సహకరించిన రాజకీయ నాయకులు, పార్టీలను విస్మరించకుండా సమయమొచ్చినప్పుడు వారిని ఆదరించాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండల కేంద్రంలో ఉన్న అగ్నికుల క్షత్రియ సంఘ భవనంలో జెడ్‌పి నిధులు రూ.15 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో నిర్మించిన అదనపు భవనాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్, ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్‌లతో కలిసి జెడ్‌పి చైర్‌పర్సన్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2009లో ఇచ్ఛాపురం నియోజకవర్గం వచ్చిన తాను స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియ సంఘం సభ్యులు కొత్తూరులో ఉన్న సంఘం భవనం మరమ్మతులకు నిధులు కేటాయిస్తానని తెలిపారు. ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియ సంఘం శ్మశానవాటికలో బోరు నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. సర్పంచ్ పూడి లక్ష్మణరావు మాట్లాడుతూ శ్మశానవాటికలో విద్యుత్ సరఫరా జరిగేలా అధికారులతో మాట్లాడి సహకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నాయకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి పూడి నీలాచలం, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, నాయకులు పులకల శ్రీరాములు, బెందాళం వెంకటేశ్వరరావు, దుద్ది ధర్మారావు, బాబురావు, ఎలమంచి నీలయ్య, బర్ల నాగభూషణం, మొగిలిపురి సీతారాం, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

శ్రీకాకుళం సిటీ : ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నరంలోని విశాఖ-ఎ కాలనీలో శు క్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి నియోజక వర్గ ప్రజల నుంచి విన తులు స్వీకరించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వివిధ వర్గాల ప్రజలు, నియోజకవర్గంలోని గార, శ్రీకాకుళం రూరల్ మండలం, పట్టణం నుంచి పెద్దఎత్తున వినతులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి పాలనలో అందరికీ సమన్యాయం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యం, విద్యుత్ లోఓల్టేజ్, కాలువలు, సాగునీరు తదితర సదుపాయాల కల్పనకు సంబంధించి వినతులు అందుతున్నాయని వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రవికుమార్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పలు సమస్యలపై అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మొదలవలస రమేష్, అన్నెపు భాస్కరరావు, ఎండ అప్పలనాయుడు, నాగళ్ల మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థిని

ఇచ్ఛాపురం: పుట్టినరోజు సందర్భంగా అనవసర ఖర్చులు పక్కన పెట్టి మొక్కలు నాటి ఆదర్శంగా నిలిచిన విద్యార్థిని స్వాతిని పలువురు అభినందించారు. పట్టణంలో మహిళా కళాశాలలో ఒకేషనల్ టీచర్ శాంతిశ్రీ చెప్పిన మాటను వేదంగా భావించిన స్వాతి శుక్రవారం పుట్టిన రోజు సందర్భంగా కళాశాలలో మొక్కలు నాటారు. ఫస్టియర్ విద్యార్థిని స్వాతి తన పుట్టిన రోజుని పురస్కరించుకొని ఇంటర్ ఉమెన్స్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ వి.శంకరరావు ఆధ్వర్యంలో ఓ మొక్కను నాటి పలువురికి ఆదర్శంగా నిలిచింది. కార్యక్రమంలో టీచర్లు రజని, సుధాకర్, ప్రసాద్, సునీత, శాంతిశ్రీ పాల్గొన్నారు.

విఒఎలకు గౌరవ వేతనంపై హర్షం

ఇచ్ఛాపురం: కొత్త విఒఎలకు (2019 తరువాత గ్రామ సంఘం ద్వారా నియమించిన వారికి గౌరవ వేతనం మంజూరుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. పేదరిక నిర్మూలన సంస్థ వెలుగు ద్వారా ప్రభుత్వానికి సంబంధిత మంత్రి, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో 2019 తరువాత గ్రామ సంఘాల్లో చేరి ఆరేళ్లుగా సేవలందిస్తూ గౌరవ వేతనం కోసం ఎదురు చూస్తున్న వారికి మోక్షం లభించింది. ఇదే విషయం అనేకమార్లు ప్రభుత్వానికి తమ గోడును వినతుల రూపంలో తెలియజేయడంతో నేటికి న్యాయం జరిగిందన్నారు. ఏప్రిల్ 2025 నుంచి రూ.8 వేలు, గ్రామ సంఘ ఆదాయం నుంచి రూ.2 వేలు మొత్తం రూ.10 వేలు తీసుకోవడానికి అవకాశం కలిగింది. అందులో భాగంగా శుక్రవారం గౌరవ వేతనం జనరేట్ చేసుకోవడానికి రాష్ట్రంలో అన్ని మండలాలకు ఆప్షన్ రావడం జరిగిందని సెర్ఫ్ ఎపిఎం ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, సెర్ఫ్ మంత్రి, సిఎం, పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్య నిర్వహణాధికారి, జిల్లా పీడీకి విఒఎలు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ సంతాపం

శ్రీకాకుళం సిటీ: అహ్మదాబాద్ నుంచి లండన్‌కి బయలుదేరిన విమానం బోయింగ్ 787 ఘోర ప్రమాదానికి గురై సుమారు 240 మంది చనిపోవడం చాలా బాధాకరమని డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. దేశ చరిత్రలో ఇంత పెద్ద ఘటన దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. హాస్టల్‌లో ఉన్న మెడికల్ విద్యార్థులు మరణించడం దురదృష్టకరమన్నారు. మరణించిన ప్రయాణికులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం సహాయ చర్యలు చేపట్టాలని కోరారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి

నరసన్నపేట: అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నరసన్నపేట వైసిపి కార్యాలయంలో శుక్రవారం నివాళ్లర్పించారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పార్టీ నాయకులతో కలిసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, రాష్ట్ర పొందర కూరకుల కార్పొరేషన్ విభాగ అధ్యక్షులు రాజపు అప్పన్న, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కె.సిహెచ్ గుప్తా, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు ముంజేటి కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి రావాడ రామారావు, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు ధర్మాన జగన్, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు సురంగి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బూర్జ: మండలంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి గీతారాణి శుక్రవారం తెలిపారు. మామిడివలస గ్రామానికి సంబంధించి ఎస్‌సి మహిళ, అన్నం పేటకు సంబంధించి ఒసి మహిళకు కేటాయించడం జరిగిందన్నారు. అభ్యర్థులు స్థానికంగా నివాసం కలిగి ఉండి వివాహిత మహిళలు అయి ఉండాలన్నారు. వయసు 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. అభ్యర్థులు లేకపోతే 18 ఏళ్ల వయసు నిండిన వారిని కూడా పరిగణించనున్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు కనీస విద్యార్హత పదో తరగతి, సహాయకులకు ఏడో తరగతి ఉండాలన్నారు. దరఖాస్తులను జూన్ 20 నాటికి బూర్జ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలన్నారు. అనంతరం ఇంటర్వ్యూ తేదీ, ప్రదేశం తెలియజేయడం జరుగు తుందన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

బూర్జ: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ, సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలతో పాటు బ్యాగ్‌ను అందజేసినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుస్మిత శుక్రవారం తెలిపారు. ముఖ్యంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రూ.10వేలు విలువచేసే ఎంసెట్ మెటీరియల్ అందజేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఉత్తమమైన విద్యను అందించడంతో పాటు అన్ని రకాల మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందన్నారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. మండలంలో పాలవలస, బూర్జ, మామిడివలస జిల్లా పరిషత్ హైస్కూల్‌లు ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరినట్లయితే ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలకు, కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు.

విత్తనాల పంపిణీ

ఇచ్ఛాపురం: మండలంలో తేలుకుంచి గ్రామ పంచాయతీలో శుక్రవారం టిడిపి నాయకులు మేరుగు సూర్యనారాయణ రెడ్డి చేతులమీదుగా విత్తనాల పంపిణీ చేపట్టారు. ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేరుగు నారాయణ రెడ్డి, మేరుగు హరికృష్ణ, దక్కత శ్రీనివాస్, మేరుగు డాంబ, దక్కత పురుషోత్తం, మేరుగు నూకరాజు, గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలి

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు మున్సిపల్ కమిషనర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం జన సైనికులతో కలిసి పలు సమస్యలను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా మున్సిపాలిటీలో ఉన్న పదమూడు షాపుల వేలానికి ప్రజలకు పూర్తి సమాచారం అందలేదని, ప్రజలందరికీ తెలిసే విధంగా మరోసారి అవకాశం ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని జనసేన తరుపున కోరారు. 22వ వార్డులో శాంతినికేతన్ స్కూల్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, కొళాయి పైపులైన్ వేసి సుమారు 15 ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ ఆ పైపుల నుంచి నీళ్లు రావడం లేదని, 20వ వార్డుకు చెందిన కొండ పోలమ్మ కాలనీ ఏర్పాటు చేసి 25 ఏళ్లయినప్పటికీ ప్రధాన రహదారులు, వీధిదీపాలు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే 10వ వార్డు మెయిన్ రోడ్డు కార్జివీధి నుంచి స్వర్ణభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ వరకు రోడ్డు, డ్రైనేజీ సరిగాలేవని, మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డుల్లో వీధిలైట్లు సరిగా పనిచేయడం లేదని, వర్షాల కారణంగా కాలువల్లో మట్టి పేరుకుపోయిందని కాలువలను పరిశుభ్రం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధన రెడ్డి, రోకళ్ల భాస్కర్, కల్యాగౌడో, ప్రేమ్ కుమార్ బిసాయి, రుక్మాంధరరావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాకుళం సిటీ : యోగాసనాలు వేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

యోగాసనాలు జీవితంలో భాగం కావాలని జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ కరుణశ్రీ అన్నారు. 80 అడుగుల రహదారిలో శుక్రవారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతిరోజు ఇంటి వద్దే యోగాసనాలు చేసుకోవచ్చన్నారు. యోగాసనాలు వేయడం వలన ఆరోగ్యం మెరుగు పరచుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు పాండ్రంకి మురళీకృష్ణ, ఆయుష్ శాఖ నుంచి చంద్రశేఖర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎఇ హరీష్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: నిత్యం యోగా చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలకా రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యలయం వద్ద జరుగుతున్న యోగా తరగతుల్లో చైర్‌పర్సన్ పాల్గొన్నారు. మున్సిపాలిటీ ప్రాంగణంలో యోగాంధ్ర సందర్భంగా. స్వామి రిత్వాజీ మహారాజు ఆధ్వర్యంలో నిత్య యోగా సాధన నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీ కమిషనర్ రమేష్, కరాటే టీచర్ దుర్గాప్రసాద్, పతంజలి యోగాసమితి సభ్యులు యోగా చేశారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ

రణస్థలం రూరల్ : విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయానికి విద్యార్థులకు బుక్స్, యూనిఫారం పంపిణీ చేయడంతో ప్రభుత్వం విద్యకు ఎంతగా ప్రాధాన్యత ఇస్తోందో తెలుస్తోందన్నారు. అలాగే విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం సన్నబియ్యం అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమం మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, కూటమి నాయకులు లంక శ్యాం, పిసిని జగన్నాధం నాయుడు, పిన్నింటి భానోజీ నాయుడు, ఆకుల రవికుమార్, రౌతు శ్రీనివాసరావు, వద్దాది శ్రీనివాసరావు, లక్ష్మణరావు, మహేష్, సత్తిబాబు, ఎంపిడిఒ ఈశ్వరరావు, ఎంఇఒలు అజ్జాడ త్రినాథరావు, లావణ్య, హెచ్‌ఎం బి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలంలో పలు పాఠశాలల్లో విద్యార్థులకు స్థానిక నాయకుల ఆధ్వర్యంలో స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. హెచ్ఎన్ పేట పంచాయతీ కేశినాయుడు పేటలో హెచ్ ఎం గిరిధరరావు పంపిణీ చేశారు. మరువాడ పంచాయతీ ఎం మరువాడ, డి మరువాడ, ఆర్ మరువాడ పాఠశాలల్లో సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, విద్య కమిటీ చైర్మన్ సూరాడ దాసురాజు, గంట లోకేష్, మణి పాఠ్యపుస్తకాలు, విద్యాసామాగ్రి పంపిణీ చేశారు.

నౌపడ : కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

ఎన్‌సిసి క్యాడెట్స్‌కు స్కాలర్‌షిప్ అవార్డు

రివార్డును అందజేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎన్‌సిసి క్యాడెట్స్‌కు ఒక్కొక్కరికి రూ.6 వేలు చొప్పున నలుగురికి సిడబ్ల్యుఎస్ స్కాలర్ షిప్ అవార్డ్సును 14 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సిసి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ ప్రసూన్ కుమార్ పాండా చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 - 25 విద్యా సంవత్సరానికి జిల్లాలో 14 ఆంధ్ర ఎన్‌సిసి బెటాలియన్ యూనిట్ పరిధిలో గల జిల్లాలో ఏ పాఠశాలకు దక్కని గొప్ప గౌరవం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆమదాలవలస ఎన్‌సిసి క్యాడెట్స్‌కు మాత్రమే దక్కిందన్నారు. ఎన్‌సిసి, అకాడమిక్‌లోనూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సిసి క్యాడెట్స్ చూపించిన ప్రతిభకు గుర్తుగా క్యాడెట్ వెల్ఫేర్ సొసైటీ నుంచి రూ.6 వేలు చొప్పున నగదు పురస్కారాలను అందించడం జరిగిందన్నారు. పురస్కారాలు సాధించిన నలుగురు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ అవార్డులను ఎన్‌సిసి విద్యార్థులు వేడి వాయిస్ నుంచి క్యాడెట్ ప్రశాంత్ కుమార్, దిలీప్, జెడబ్ల్యు గర్ల్స్ నుంచి క్యాడేట్ ఢిల్లీశ్వరి, క్యాడెట్ శ్రీమణిలను వారికి తర్ఫీదు ఇచ్చిన ఎన్‌సిసి ఆఫీసర్స్ పి.మోహనరావు, శరత్ కుమారిలకు పాఠశాల హెచ్‌ఎం కె.అప్పల రాములు, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసి సభ్యులను స్థానికులు అభినందించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆదర్శం

ప్రభుత్వ పాఠశాలలో చేరిన ఉపాధ్యాయుల పిల్లలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలం పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు జాయిన్ చేయడం నేటి ఉపాధ్యాయ లోకానికి గర్వకారణమని హెచ్‌ఎం, డిప్యూటీ డిఇఒ పి.విలియమ్స్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వం కేటాయించిన ఉపాధ్యాయుల బదిలీల్లో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు బదిలీలు ప్రస్తుతం జరిగాయి. బదిలీలో జడ్‌పిహెచ్‌ఎస్ పోలవరం పాఠశాలకు విచ్చేసిన ఆంగ్ల ఉపాధ్యాయుడు పి.రెయ్యన్న తన కుమారుడును తొమ్మిదో తరగతిలో, కుమార్తెను ఆరవ తరగతిలో, సైన్స్ ఉపాధ్యాయులు పి.లేపాక్షి తన కుమారుడిని ఆరో తరగతిలో వారు బదిలీ అయిన పాఠశాలలో చేర్పించడం సంతోషంగా ఉందన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులను హెచ్‌ఎం అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న మార్పుల దృష్ట్యా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకంతో తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాల నుంచి తీసుకువచ్చి తమ పాఠశాలలో చేర్పించడం గర్వంగా ఉందన్నారు.

కాలువ కప్పేశారు

సచివాలయం ముందు కప్పేసిన మురుగు కాలువ

లావేరు: మండల కేంద్రం లావేరు మెయిన్ రోడ్డులోని శ్రీకాకుళం, చీపురుపల్లి ప్రధాన రహదారిని అనుకుని ఉన్న మురుగునీటి కాలువను గత వైసిపి పాలనలో సచివాలయ నూతన భవన నిర్మాణం చేపట్టారు. ఆ సమయంలో సచివాలయం నిర్మాణం కోసం మెటీరియల్ వేసేందుకు దూరదృష్టి లేకుండా తాత్కాలిక ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామ ప్రజలకు ఇబ్బంది కలిగించే నిర్ణయంతో కాలువ పూర్తిగా నామరూపాలు లేకుండా కప్పివేశారు. దీంతో రహదారి పక్కన సుమారు అరకిలో మీటర్ దూరం మేర మురుగునీరు కాలువల్లో ప్రవహించకపోవడంతో ఎక్కడికక్కడే మురుగునీరు విలయతాండవం చేస్తూ దుర్గంధపు వాసనతో ప్రజలు సతమతమవుతున్నారు. గత కొన్నేళ్లుగా ఆ కాలువలో పూడికలు తీయకపోవడంతో ఆ మురుగు నీరులో పాములు, జలగలు చేరి ఇళ్లల్లోకి వచ్చేస్తున్నా కనీసం అధికారులు, పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో పలువురు అనారోగ్యం బారిన పడుతూ ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తీతలు తీయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పిడుగుపాటుకు 4 ఆవులు మృతి

మృతి చెందిన ఆవులు

లావేరు: మండలంలోని బుడుమూరులో జాతీయ రహదారి పక్కన ఉన్న చెట్టు కింద శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో వర్షం పడుతుండగా నాలుగు పాడి ఆవులు చెట్టు కిందకు వెళ్లి ఉన్న సమయంలో పిడుగుపడటంతో నాలుగు ఆవులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. అక్కడే ఉన్న ఆవు యజమాని పిట్ట అప్పయ్య ప్రమాదం నుంచి తృటిలో తప్పాడు. అప్పుడే వర్షం వస్తుందని పక్కనే ఉన్న విశాఖ డైరీ కళ్యాణ మండపం వద్దకు వెళ్లిపోవడంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. అప్పయ్యకు చెందిన రెండు ఆవులు, పండి ధనంజయ రావు, ఆరంగి రామన్నలకు చెందిన ఆవు పిడుగు పాటుకు మృతి చెందాయి. ఆవు పాలతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్న వీరికి పిడుగు రూపంలో ఆవులు మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఆర్ఐ రాపర్తి అప్పలరాజు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. పశు వైద్యాధికారి హేమంత్ కుమార్, పి. రాజేశ్వరి పశులకు పోస్టుమార్టం నిర్వహించారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

చోరీకి విఫలయత్నం

మెళియాపుట్టి: మండలంలోని గోకర్ణపురం మెయిన్ రోడ్ సమీపం వద్ద శుక్రవారం అదే గ్రామానికి చెందిన గేదెల మహాలక్ష్మికి చెందిన మెడలోని పుస్తెలతాడును దొంగ తెంపే ప్రయత్నంలో మహిళ ప్రతిఘటించడంతో దొంగ పారిపోయాడు. పెద్ద లక్ష్మీపురంలో తన తండ్రి కార్యానికి వచ్చి తిరిగి వెళుండగా గోకర్ణపురం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని పుస్తెలతాడును తెంపే ప్రయత్నంలో మహిళ కేకలు వేసి ప్రతిఘటించడంతో దొంగలు పారిపోయారు. ఈ సంఘటనపై పోలీసులకు సమాచారం అందడంతో దర్యాప్తు జరుపుతున్నారు.

జూదరుల అరెస్టు

వజ్రపుకొత్తూరు: మండలం అక్కుపల్లి తీరం పరిసర ప్రాంతంలో శుక్రవారం పోలీసులు ఆకస్మిక దాడులు చేసి పేకాట అడుతున్న 11 మంది జూదరులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5060ల స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నా, పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.నిహార్ తెలిపారు.

'ఉపాధి' అవగాహనా సదస్సు

బూర్జ: మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధిహామీ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన ఉపాధి పనులు, అలాగే కూలీలకు చెల్లిస్తున్న వేతనాలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టబోయే పనులపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏగు అనురాధ, ఎన్ఆర్ఐ, స్టేట్ హ్యూమన్ రైట్స్ డైరెక్టర్ వ్యాపారి వెంకటేష్, ఎంపిటిసి చుక్కల పోలినాయుడు, ఎపిఎం బాబురావుతో పాటు సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, కూలీలు పాల్గొన్నారు.

మున్సిపల్ షాపులకు వేలం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మున్సిపల్ షాపులకు కమిషనర్ ఎన్.రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం వేలం పాట నిర్వహించారు. పట్టణంలో ఆస్పత్రి రోడ్డులో ఉన్న షాపులు, షరాభ వీధిలో, మెయిన్ రోడ్డులో ఉన్న మొత్తం పది షాపులకు వేలం పాట నిర్వహించగా 35 మంది వేలంపాటలో పాల్గొన్నారు. వేలం పాటలో ఖరారు చేసిన వివరాలు కౌన్సెల్ సమావేశంలో ప్రవేశ పెట్టి కౌన్సెల్ ఆమోదం తర్వాత షాపులు కేటాయిస్తామని కమిషనర్ మేనేజర్ అప్పల స్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్ పాల్గొన్నారు.

బరువు తగ్గిన పుస్తకం

టెక్కలి: పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు పుస్తకాల సంచి బరువు తగ్గించాలన్న ప్రభుత్వ ఆలోచన మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా అందించే పుస్తకాల బరువును తగ్గించారు. ఈ మేరకు మూడు భాషలకు సంబంధించిన పాఠ్యాంశాలను ఒకే పుస్తకంలో ముద్రించి మూడు భాషల పుస్తకాన్ని ఒకటిగా మార్చి పంపిణీ చేశారు. ఇందులో భాగంగా విద్యా సంవత్సరం మెత్తాన్ని కలుపుకుని రెండు సెమిస్టర్‌లుగా విభజించారు. ఒక సెమిస్టర్‌కుగాను పాఠ్యాంశాలను ముద్రించి తెలుగు, హిందీ, ఆంగ్లం మూడు భాషలకు చెందిన పాఠ్యాంశాలను ఒకే పుస్తకంగా సరఫరా చేశారు. ఆరవ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు అందించే పాఠ్య పుస్తకాలను మార్చారు. ఈ ఏడాది ప్రకటించే విద్యాశాఖ అకడమిక్ కేలండర్‌లో ప్రతి శనివారంను నో బ్యాగ్ డేగా గుర్తించారు. అదే విధంగా పుస్తకాల భారాన్ని కూడా తగ్గిస్తు మూడు భాషలకు ఒకే పుస్తకం రూపంలో అందివ్వడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

1219 మంది హాజరు

శ్రీకాకుళం సిటీ: జిల్లాలో ఆరు ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో డిఎస్‌సి పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ నెల ఆరువ తేదీన ప్రారంభమైన ఈ పరీక్షలు 30 వరకు కొనసాగనున్నాయి. రెండు షిఫ్టుల్లో పరీక్షలు శక్రవారం నిర్వహించారు. మొదటి షిఫ్టులో 994 మందికి 944 హాజరుకాగా 50 మంది గైర్హాజరయ్యారు. 94.97 శాతం హాజరయ్యారు. రెండో షిఫ్టులో 1270 మందికి 1219 మంది హాజరుకాగా 51 మంది గైర్హాజరయ్యారు. 95.98 శాతం హాజరయ్యారు.